www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 25 మే 2023

5

తిరుపతి

అడ్మిషన్ల 'దందా'

అడ్వాన్స్ బుకింగ్ అంటూ పిఆర్‌ఓల హడావుడి

కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ నిర్లక్ష్యం

"మేడం...! భార్గవ్ .. మీ అబ్బాయేగా. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో పాసయ్యాడు. అందుకే వెతుక్కుంటూ మీ ఇంటికి వచ్చాం. ఇంటర్‌లో మంచి కళాశాలలో చేర్పిస్తేనే మీ అబ్బాయి భవిష్యత్తు బాగుంటుంది. మా కళాశాలలో కొంచెం ఫీజు ఎక్కువైనా నాణ్యమైన విద్యను అందిస్తాం. ఇంటర్‌తో పాటే ఎంసెట్‌కు ప్రత్యేక తర్ఫీదును ఇస్తాం. అంతే కాదు ఐసి, ఎసి బ్యాచ్‌లనూ రన్ చేస్తున్నాం. రెండు దశాబ్దాలుగా రాష్ట్ర స్థాయి ర్యాంకులన్నీ మావే. ఒకవేళ ఈ ప్రభుత్వం ర్యాంకులను ప్రకటించి ఉంటే అత్యుత్తమ ర్యాంకులన్నీ మావే. ఇదిగో మా కళాశాల ప్రత్యేకతలతో కూడిన బ్రోచర్‌ను చూడండి. మాకున్న పేరు రాష్ట్రంలో ఏ విద్యాసంస్థకూ లేదు. సాధారణ విద్యార్థులను సైతం స్టేట్ ర్యాంకర్‌లుగా తీర్చిదిద్దిన ఘనత మా కళాశాలదే. ఇప్పుడు మీరు తొందరపడకుంటే మళ్లీ మా కళాశాలలో సీటు దొరకడం అంత సులభం కాదు. పైగా ఇప్పుడే అడ్వాన్స్ బుకింగ్ (రిజిస్ట్రేషన్) చేసుకుంటే మీకు ప్రత్యేక రాయితీ ఇస్తాము. ప్రస్తుతానికి రూ. 2 వేలివ్వండి. మిగిలింది పిల్లాడిని చేర్పించేటప్పుడు చెల్లిస్తే చాలు. ఇదిగో దరఖాస్తు ఫారం. వీటిని నింపి సంతకం పెట్టండి "

- ఇదీ తిరుపతిలో ఓ కార్పొరేట్ కళాశాల పిఆర్‌ఓల హడావుడి

" సార్..!. మీ ఇంట్లో బడి ఈడు పిల్లలున్నారా... ఉంటే మా పాఠశాలలోనే చేర్పించండి. ఎల్‌కేజీ నుంచీ 10 తరగతి వరకూ మా పాఠశాల పిల్లలందరూ ఇంగ్లీషులోనే మాట్లాడేలా మేం తయారు చేస్తాం. మా పాఠశాలలో ఒకటో తరగతి నుంచే కంప్యూటర్ చదువులు చెప్పిస్తాం. ఇంగ్లీషులోనే గడగడా మాట్లాడించేస్తాం. మిగతా బడుల్లో ఉన్న అయ్యోర్లకంటే 10 రెట్లు బాగా చదువు చెప్పే టీచర్లు మా పాఠశాలలో ఉన్నారు. ఐదంతస్తుల పెద్ద భవనంలో స్కూల్‌ను ఏర్పాటు చేశాం. రానుపోను బస్సు సౌకర్యం ఉంది. ప్రత్యేకంగా కంప్యూటర్లు, ల్యాబ్, ప్లేగ్రౌండ్ ఉన్నాయి. తెల్లారి 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తాం. పదో తరగతికి అయితే స్పెషల్ క్లాసులు, స్టడీ అవర్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ శిక్షణ తో పాటు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. ఈ కారణంగానే మా పాఠశాల విద్యార్థులు ప్రతిఏటా అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారు. నర్సరీ నుంచి 10 తరగతి వరకు మా పాఠశాలదే అన్నింటా అగ్రస్థానం. మీకు మీ పిల్లల భవిష్యత్తే ముఖ్యమని భావిస్తే, కొంత ఎక్కువ ఖర్చయినా ..వారి బాధ్యత మాకు అప్పగించండి..'

- ఇదీ మంగళంలో ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం కాన్వాసింగ్

ప్రజాశక్తి-తిరుపతి

వేసవి సెలవులు ఇంకా ముగియనే లేదు. కొన్నిచోట్ల ఇవ్వనేలేదు. ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థుల్ని, వారి తల్లితండ్రుల్ని తమ వైపుకు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థుల తల్లితండ్రుల వెంటపడుతూ వారికి గాలం వేసేందుకు సిద్ధమవుతున్నారు. పిఆర్‌ఓలను నియమించుకుని ఇంటింటికీ తిప్పుతూ తమ కళాశాలల్లో ఉన్నవీ లేనివీ అన్నింటినీ కలిపి విస్తృత ప్రచారం చేస్తున్నారు. రంగురంగుల బ్రోచర్స్ తో విద్యార్థుల తల్లిదండ్రుల్ని మభ్యపెడుతున్నారు. అడ్వాన్స్ బుకింగ్ అంటూ ఇంటర్‌లో అడ్మిషన్లను చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ఆయా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు పెద్దఎత్తున కమీషన్‌లు ఇచ్చి వారి ద్వారానే విద్యార్థుల తల్లితండ్రులకు ' పలానా కళాశాలలో చదువు బాగా చెబుతారు. మేము మీకు రెకమండ్ చేస్తాం. ఫీజుకూడా తగ్గించేలా చూస్తాము ' అని చెప్పించి , తద్వారానూ అడ్మిషన్లను చేస్తున్నారు. వీరి మాటలు నమ్మి ఆ కళాశాలలో చేరిన తర్వాత గానీ పిఆర్‌ఓలు తొలుతగా చెప్పిన ఫీజుకు, ఆయా కళాశాలలు వసూలు చేస్తున్న ఫీజులకు ఏమాత్రం సంబంధంలేదన్న విషయం తెలియడం లేదు. ఇక చేసేది లేక విద్యార్థుల తల్లితండ్రులూ కార్పొరేట్ కళాశాల అడిగినంతా ఇవ్వకతప్పడం లేదని వాపోతున్నారు. పాఠశాలల స్థాయిల్లోనూ ప్రయివేటు యాజమాన్యాలు పోటీలు పడి మరీ ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల్ని తమ వైపుకు తిప్పుకునేందుకు పెద్దఎత్తున కాన్వాసింగ్ చేస్తున్నారు.

కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి : మాధవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి జిల్లా

పదో తరగతి పరీక్షలు ముగియకుండానే కొన్ని ప్రైవేటు కార్పొరేట్ యాజమాన్యాలు పెద్దఎత్తున కాన్వాసింగ్ చేస్తూ వచ్చింది. ఇప్పుడేమో అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారు. ప్రైవేటు స్కూళ్లలోనూ టీచర్లకు టార్గెట్‌లను ఇచ్చి మరీ అడ్మిషన్లను చేస్తున్నారు. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధమని అటు డిఇఒ, ఇటు ఆర్ఐఒలకూ తెలుసు. ఇలాంటి విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు రాతపూర్వకంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశాం. అయినా స్పందన లేదు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలేమో బరితెగించి వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటిపై చర్యలు తీసుకోకుంటే విద్యాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు తీవ్రతరం చేస్తాం. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఒకటికి రెండు సార్లు ఆలోచించి విద్యార్థులను కళాశాలలో చేర్పించాలి. కార్పొరేట్ యాజమాన్యాలు పెట్టే మార్కుల ప్రలోభాలకు లొంగకుండా వాస్తవంగా ఆలోచించి, మంచి కళాశాల, పాఠశాలల్లో చేర్పించాలి.

ఆధునిక టెక్నాలజీతో...

తిరుమలలో పటిష్టమైన భద్రత

ప్రజాశక్తి - తిరుమల

ఆధునిక టెక్నాలజి సాయంతో తిరుమలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామని రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -1 వద్ద బుధవారం అయిన మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో రెండు రోజులపాటు భద్రతాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించామని చెప్పారు. సీసీటీవీ కంట్రోల్ రూమ్ లో కృత్రిమ మేధను ఎలా వినియోగించాలి, ఎలాంటి సాఫ్ట్వేర్లను వాడాలి అనే అంశాలపై అధ్యయనం చేస్తామన్నారు. అదేవిధంగా యాంటీ డ్రోన్ టెక్నాలజీ, బాడీ స్కానర్స్ వినియోగంపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. డిఐజి అమ్మిరెడ్డి మాట్లాడుతూ భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపడానికి ఎస్పీ లేదా ఏఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఏడు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీల్లోని అధికారులు 15 రోజుల పాటు పరిశీలన జరిపి నివేదిక సిద్ధం చేస్తారని, మరోసారి సమావేశమై సమీక్షిస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తర్వాత కమిటీలు చేసిన సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తామన్నారు. అంతకుముందు తిరుమల శ్రీవారి ఆలయం, కొత్త పరకామణి భవనం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1, కమాండ్ కంట్రోల్ రూమ్ తదితర ప్రాంతాలను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించి భద్రత అంశాలను తనిఖీ చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో తిరుమలలో సిసి కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తించే విధానాన్ని పరిశీలించారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఓఎస్డీ ఐఎస్ డబ్ల్యు శశిధర్ రెడ్డి, టిటిడి సివిఎస్వో నరసింహ కిషోర్, ఇంటెలిజెన్స్ ఎస్పీ సుమిత్, గ్రేహౌండ్స్ ఎస్పీ బిందుమాధవ్, 14వ బెటాలియన్ కమాండెంట్ జగదీష్, తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, ఆక్టోపస్, ఎస్పీఎఫ్, జిల్లా పోలీసు, అటవీ, అగ్నిమాపక, ఇతర బలగాలకు చెందిన పలువురు అధికారులు, టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి, వీజీవోలు బాలిరెడ్డి, మనోహర్, గిరిధర్‌రావుతోపాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

హోంశాఖ ప్రధాన కార్యదర్శి హరీష్‌కుమార్‌గుప్తా

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. బుధవారం స్వామివారి దర్శనం కోసం భక్తులు 20 కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు. శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం స్వామివారిని 75,875 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.07 కోట్లు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. స్వామివారికి 35,439 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

రూ.300 ప్రత్యేక దర్శన టిక్కెట్ల విడుదల

తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శన టికెట్లను టిటిడి బుధవారం విడుదల చేసింది. జులై, ఆగస్టు నెల 300రూ.దర్శనం టికెట్లు ఉదయం 10 గంటలకు విడుదల చేయడంతో అప్పటికే వేచియున్న భక్తులు రెండునెలల టికెట్లను ముడుగంటల్లో కొనుగోలు చేశారు.

భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - బాలాయపల్లి

మండలంలోని గొట్టికాడు గ్రామంలో పెత్తందారులు దళితులపై దాడులు చేసి భూములు ఆక్రమించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద గొట్టికాడు గ్రామ మహిళలు, సిపిఎం, వ్యవసాయకార్మికసంఘం, రైతుకూలీల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తైదిపాటి గురవమ్మకు 25 ఏళ్ల క్రితం 224/2 సర్వే నంబర్‌లోని మూడు ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చిందని, పట్టాదారు పాసు పుస్తకం కిందన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన పుచ్చలపల్లి హరి, శ్రీనివాసులురెడ్డిలు రాత్రికి రాత్రి దళితురాలైన గురవమ్మ పొలం ఆక్రమించి నిమ్మచెట్లు నాటారన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకూ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. భూఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే ధర్నాలతో పాటు, రిలేదీక్షలు చేపట్టేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. దళితులకు అండగా సిపిఎం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, రాజగోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయాలకు ఒక్క బస్తా ఇస్తే ఒట్టు

ప్రజాశక్తి - బాలాయపల్లి

'ప్రభుత్వం సచివాలయాల నిర్మాణం కోసం సిమెంట్ బస్తాలు పంపిస్తే.. ఒక్క బస్తా కూడా ఇవ్వకుండా అమ్ముకుంటున్నారు' అని యాచవరం సహకార సంఘం అధ్యక్షులు రావిళ్ల వెంకటకృష్ణనాయుడు నిలదీశారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రావిళ్ల వెంకటకృష్ణనాయుడు మాట్లాడుతూ అధికారులు, నాయకులు కొంతమంది కుమ్మక్కయ్యి బాలాయపల్లి మండలానికి పంపించిన సిమెంట్ బస్తాలు వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్‌లో దాచి అక్కడనుంచి అక్రమంగా తరలించి అమ్ముకుంటున్నారని విమర్శించారు. కయ్యూరు గ్రామంలో సచివాలయం పనులు పూర్తి కావస్తున్నా ఒక్క సిమెంట్ బస్తా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. అలిమిలి గ్రామంలో ఇంతవరకూ సచివాలయం పనులు ప్రారంభించకనే సిమెంట్ బస్తాలను అక్రమంగా అమ్ముకున్నారన్నారు. ఏఏ సచివాలయాలకు ఎన్ని సిమెంట్ బస్తాలను అక్రమంగా తరలించారో మొత్తం తన దగ్గర పూర్తి సమాచారం ఉందన్నారు. పేదలు మట్టి తోలుకుంటే ఎందుకు కేసులు పెట్టి బెదిరిస్తున్నారని పాకపూడు గ్రామ సర్పంచి మల్లిమాల గోపికృష్ణారెడ్డి అధికారులను నిలదీశారు. చినుకుపడితే ఇళ్ల ముందు మోకాళ్ల లోతు నీళ్లు నిలబడుతున్నాయన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులనున పేదలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అక్కంపేట గ్రామంలో తాగునీటికి అల్లాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపిటిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సిమెంట్ బస్తాల అక్రమాలు, లోతట్టు ప్రాంత ఇళ్లకు మట్టి తోలుకునే విషయాలను కలెక్టర్‌కె.వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డి చెప్పారు. బాలాయపల్లి మండలంలో దాదాపు 16వేల బస్తాల సిమెంట్ అక్రమాలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

'సిమెంట్' అక్రమంగా అమ్ముకున్నారు..!
మండల సర్వసభ్య సమావేశంలో నిలదీత

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పిఎంఇజిపి రుణాలను సకాలంలో గ్రౌండింగ్ చేయాలని, పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్ష జరిగింది. ప్రధానమంత్రి ఉపాధి కార్యక్రమంపై సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తుల గ్రౌండింగ్, ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలు, ఎల్‌డిఎం వాటికి అనుబంధ బ్యాంకులు లోన్లు ఇచ్చేలా సత్వరమే గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగిల్ డెస్క్ విధానంలో 2023, ఏప్రిల్ నుంచి 80 పరిశ్రమలకు గాను 57 అనుమతులు సకాలంలో ఇచ్చామని, మరో 23 పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 55 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ.2.48 కోట్లు అందించడానికి ఆమోదం తెలిపారు. క్లస్టర్ అభివద్ధి కార్యక్రమం ఏర్పేడు మండలం మాధవమాల కింద వుడ్ కార్వింగ్ క్లస్టర్, కాపర్ వేజెల్స్ క్లస్టర్ ఎర్రమరెడ్డి పాలెం, రేణిగుంట మండలం, వెంకటగిరి శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించారు. ఈ ఏడాదీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నందు మన రాష్ట్రము మొదటి ర్యాంకును పొందేందుకు తిరుపతి జిల్లాలోని అందరు అధికారులు సమన్వయంతో పనిచేయాలని వివిధ శాఖల నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపిఐఐసి తిరుపతి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకష్ణా రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ జ్యోతి పాల్గొన్నారు.

55 క్లైమ్‌లకు రూ.2.48 కోట్లు ఆమోదం

28న యుపిఎస్‌సి ప్రిలిమ్స్ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 28న ఆదివారం యూపీఎస్సీ ప్రిలిమ్స్ 2023 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షకు విధులు కేటాయించబడిన జిల్లాస్థాయి అధికారులతో, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, తహశీల్దార్‌లతో, సంబంధిత అధికారులతో కలిసి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్షలకు జిల్లాలో 6333 మంది అభ్యర్థులు రాయనున్నారని, పరీక్షల నిర్వహణ ఉదయం 9.30 నుండి 11.30 వరకు మధ్యాహ్నం 2.30 నుండి 4.30 వరకు జరుగుతాయని తెలిపారు. విద్యుత్ శాఖ వారు పరీక్షా కేంద్రంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, పోలీస్ శాఖ తగినంత మంది మహిళా సిబ్బంది, భద్రతా సిబ్బంది ఉండేల, వైద్య ఆరోగ్య శాఖ వారు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రథమ చికిత్స మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్డిఓ కస్టోడియన్ గా వారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందే గేట్లు మూసి వేయబడతాయని, ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు. కేంద్ర యుపిఎస్సి నుండి ఒక అబ్జర్వర్, రాష్ట్ర ప్రభుత్వం నుండి సీనియర్ ఐఎఎస్ అధికారి ప్రద్యుమ్న అబ్జర్వర్ గా నియామకం చేశారని, వారు త్వరలోనే జిల్లాకు రానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఏడి సర్వే జయరాజ్, డిపిఓ రాజశేఖర్ రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.



ఎంపి బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని జెవివి, యుటిఎఫ్, సిఐటియు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి బుధవారం మానవహారం నిర్వహించారు. భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని నినదించారు. నాయకులు సి.చంద్రశేఖర్, ప్రభాకర్, సునీల, సిహెచ్ సుధాకర్‌రావు, బి.పద్మ నాభయ్య, రమణయ్య, డాక్టర్ పి.ధనంజయులు, ఎస్.చెంగయ్య, రాజేష్‌బాబు, రామ్మూర్తి, మస్తాన్, భాస్కర్, రవికుమార్, శైలజ పాల్గొన్నారు.

'ఓరియో రూ.20' ప్యాక్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కొత్త ఓరియో 20ప్యాక్‌ను ప్రారంభించడానికి 20రూపాయల నాణెంతో ఒక ఆహ్లాదకరమైన ప్రయోగం ప్రారంభించిందని మార్కెటింగ్, మోండెలెజ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ నితిన్ సైనీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓరియో, ప్రపంచ నంబర్, భారతదేశానికి ప్రీతిపాత్రమైన కుకీ బ్రాండ్ 20 రూపాయల నాణెం గురించి ఊహాగానాలు పెరుగుతున్న నేపథ్యంలో తను కొత్తగా ప్రారంభించిన ఓరియో రూ.20 ప్యాక్‌తో 'సేవ్ ది రూ.20 కాయిన్' ప్రచారం ప్రారంభించిందన్నారు. 20 కాయిన్ 3 సంవత్సరాలుగా చెలామణిలో ఉన్నప్పటికీ చాలా మంది భారతీయులకు తెలియదని, దీన్ని అందరికి పరిచయం చేయడం ద్వారా తమ ఓరియా ప్రచారంతో పాటు అత్యంత విలువైన నాణెం గురించి తెలియజేస్తామన్నారు. గ్రూప్ ఎగ్జిక్యూటివ్ క్రియేటివ్ డైరెక్టర్, లియో బర్నెట్ మాట్లాడుతూ రూ.20 నాణెం దుస్థితిలో ఉందని గ్రహించామని, ఓరియా బ్రాండ్ ద్వారా ఈ ట్విస్ట్ 20 రూపాయల నాణెం తమ కొత్త ప్యాక్ రెండూ అందరి దృష్టినీ ఆకర్షించగలవని తాము ఆశిస్తున్నామన్నారు.

ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి జిల్లా చిట్టమూరు మండలానికి చెందిన ఆక్వా రైతులు తిరుపతిలోని ఎంపి నివాసంలో ఎంపి మద్దిల గురుమూర్తిని కలిసి తమ సమస్యలు విన్నవించారు. మండలంలో 1300 ఆక్వా కరెంట్ కనెక్షన్లు ఉన్నాయని, వాటిలో 136 కనెక్షన్లకి మాత్రమే సబ్సిడి వర్తిసుందని, మిగిలిన వాటికి సబ్సిడి వర్తించడం లేదని ఎంపి వద్ద రైతులు తమ ఆవేదనను విన్నవించారు. పలుమార్లు మత్స్యశాఖ అధికారులను కలిసినా తమ సమస్య పరిష్కారం కాలేదని తెలియజేశారు. స్పందించిన తిరుపతి ఎంపి వెనువెంటనే మత్స్యశాఖ అధికారులను తన కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. అది తమ పరిధిలో లేదని ఉన్నతాధికారులను ఆదేశాల మేరకు చేశామని చెప్పడంతో వెంటనే మత్స్యశాఖ కమీషనర్‌ను ఫోన్‌ద్వారా వివరాలు అడిగారు. కమీసనర్ మాట్లాడుతూ అక్కడ ఆక్వా సాగు చేస్తున్న ప్రాంతం ఆక్వా జోన్‌లోకి రాదని, అందువల్ల వారికి సబ్సిడి వర్తించడం లేదని తెలిపారు. దీనిపై ఎంపి మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది రైతులు ఆక్వా సాగు చేస్తున్నారని, మరోసారి సర్వే చేసి ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకురావాలని, చిట్టమూరు మండలమే కాకుండా తిరుపతి జిల్లా పరిధిలో ఆక్వా రైతులకు ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా వారికి న్యాయం చేయాలని సూచించారు. స్పందించిన కమీషనర్ త్వరలో అధికారుల బృందాన్ని పంపి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆక్వా రైతులు, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ చాంద్‌బాషా, మత్స్యశాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రుయా పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

తిరుపతి సిటి : రుయా ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రుయా సూపరింటెండెంట్ నాగమునీంద్రుడుకు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మి, సిఐటియు నగర అధ్యక్షులు పి.మునిరాజా మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో కార్మికులు పనిచేస్తున్నారని, జీవో ప్రకారం కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్, వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో భద్రతా పరికరాలు అందించాలని, ప్రతి కార్మికునికీ రెండు జతల యూనీఫాం ఇవ్వాలని కోరారు. పనిభారం వల్ల ఒక్కో కార్మికురాలు మూడు నుంచి నాలుగు వార్డులను శుభ్రం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రుయా పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షురాలు వి.సులోచన, కార్యదర్శి ఆర్.నాగిని పాల్గొన్నారు.

రూ.27.15 కోట్లు జగనన్న విద్యాదీవెన జమ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యాదీవెన కార్యక్రమాన్ని తీసుకొచ్చారని, తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు నుంచి ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆర్థిక సాయాన్ని విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేశారన్నారు. బుధవారం ఈ కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాట్లను కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత జగనన్న విద్యాదీవెన ఆర్థిక సాయాన్ని జిల్లాలో 30,259 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.27.15 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. విద్యాదీవెనలో నమోదు చేసే పూర్తి బాధ్యత కళాశాలల యాజమాన్యందని, ఏ ఒక్క అర్హత కలిగిన విద్యార్థిని నమోదు చేయని పక్షంలో వారికి సంబంధించిన ఫీజు మొత్తాన్ని కళాశాల యాజమాన్యం భరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, బిసి సంక్షేమ, సాధికార అధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాలంటీర్లు 'సంక్షేమ' వారధులు : మేయర్

తిరుపతి టౌన్ : వాలంటీర్లు సంక్షేమ వారధులని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఉదయం మేయర్ ఛాంబర్‌లో వాలంటీర్ల వందన కార్యక్రమాన్ని నిర్వహించి సేవామిత్ర పురస్కారాన్ని అందజేశారు. వాలంటీర్లు ప్రజలకు మరింత దగ్గర కావాలన్నారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ అధ్యక్షులు భరణియాదవ్ పాల్గొన్నారు.

బాలాయపల్లి ఎంపీడీవోగా రవీంద్రబాబు

ప్రజాశక్తి-బాలాయపల్లి: బాలాయపల్లి ఎఫ్ఏసీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న స్వరూప రాణి పదోన్నతిపై డీఎల్‌పీవో వెళ్లారు. ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి సమస్యను వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నూతనంగా రవీంద్ర బాబు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరంలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గూడూరు పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గిరినాథ్ దాతత్వంతో రూ.20 వేలు విలువ కలిగిన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. పేదలకు దుస్తులు అందించారు. అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గిరినాథ్ మాట్లాడుతూ తన మనవరాలు పుట్టినరోజు సందర్భంగా సేవాకార్యక్రమాలు చేపట్టామన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు కళ్యాణ సాయి , లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్లు మల్లెమాల మురళీరెడ్డి , వాకాటి రామ్మోహన్, సీనయ్య, జగదీష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు యూరియా పంపిణీ చేశారు. 45 కిలోల బస్తా ధర రూ.266.50 లకు రైతు భరోసా కేంద్రాల నుంచి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది భరత్, కుమార్, లావణ్య, రేవతి పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేద్దామని సహాయ కార్మిక అధికారి సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో, వివిధ సంస్థల్లో 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో నియమించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాలకార్మిక చట్టాన్ని ఉల్లంఘించిన యజమానులకు సెక్షను 14 ప్రకారం రెండు సంవత్సరాలు జైలు శిక్ష , రూ.50 వేలు జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పరిశీలన

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లులో జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను ఎస్ఎస్ఏ ఏఎల్ఎస్‌వో శ్రీధర్ బుధవారం పరిశీలించారు. వాటి నాణ్యత పరిమాణాలను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, ఎంఎస్ కోఆర్డినేటర్ హేమంత్, శ్రీరాములు, ప్రవీణ్, ఐఈఆర్టీ రమణయ్య, వెంకట్రమణ, ఎమ్మార్సీ సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి-గూడూర్ రూరల్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని దశల వారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గూడూరు తాలూకా అధ్యక్షులు శేఖర్ రావు వెల్లడించారు .బుధవారం ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో ఒక్కరోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. వైద్య సంఘం, వీఆర్వోల అసోసియేషన్ మద్దతు తెలియజేశాయి. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గూడూరు తాలూకా అధ్యక్షులు శేఖర్‌రావు మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు, పలు సమస్యలపై దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంఘ సభ్యులు రమేష్ మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీన జీతాల చెల్లించాలని.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకరయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలి



ప్రజాశక్తి-రేణిగుంట: చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలని.. ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్దాల రవిబాబు అన్నారు. బుధవారం రేణిగుంట మండలం ఆర్.మల్లవరం పంచాయతీ కుమ్మరపల్లి ప్రాథమిక పాఠశాలతో అభయ ఫౌండేషన్, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు పిల్లలకు విద్యాసామగ్రి అందించారు. ముఖ్యంగా నేటి యువత సెల్‌ఫోన్ మాయాజాలంలో పడి చదువు, సంస్కారం, సాంప్రదాయాలు మరచిపోతున్నారని.. ఇలాంటి వారికి సంస్కారంతోపాటు ఆటపాటలు, యోగ, ధ్యానం, జీవిత నైపుణ్యాల, వ్యక్తిత్వ వికాసం, పరిపూర్ణ మానవుడుగా ఉండాలంటే ఏవిధంగా నడుచుకోవాలనే విషయాలపైన శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హోరాహోరీగా చంద్రగిరి ఐపీఎల్ టోర్నీ

ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తలపెట్టిన చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో యువత పరుగులతో చెలరేగారు. బుధవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు పరుగుల వర్షం కురిపించగా పలువురు బంతులతో మాయాజాలం సష్టిస్తూ వరుస వికెట్లు తీసుకున్నారు. బరిలో దిగిన ప్రతి ఒక్కరూ విజయం కోసం శ్రమించగా మరికొందరు ఓటమితో నిరాశ చెందారు. 13 గ్రౌండ్లలో 52 మ్యాచ్‌లు నిర్వహించారు. విజేతలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

రైలు ప్రయాణం జర జాగ్రత్త..!

● భారీగా జరిమానాలు, జైలు శిక్ష పడే అవకాశాలు ● రైల్వే చట్టంలోని సెక్షన్ 138 అమలు

ప్రజాశక్తి - బాలాయపల్లి: రోజూ లక్షల మంది ప్రయాణికులు రైళ్లల్లో ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో రైలు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండటానికి, రైల్వే నుంచి ప్రజలకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మీరు రైలులో ఎక్కడికైనా ప్రయాణించాలనుకుంటే రైలు టిక్కెట్ అవసరం. చాలాసార్లు ప్రజలు టిక్కెట్ తీసుకోకుండా రైలులో ప్రయాణిస్తూ పట్టుబడటం కనిపిస్తుంది. ఇటువంటి పరిస్థితిలో ప్రజలకు జరిమానా విధించవచ్చు.

రైలు టిక్కెట్ లేకుండా ప్రయాణం నేరం

టిక్కెట్ లేకుండా రైలులో ప్రయాణించడం శిక్షార్హ ం. రైలులో టిక్కెట్ తీయకుండా ప్రయాణిసూ పట్టుబ డితే ప్రయాణికుడికి జరిమానా విధించ వచ్చు. అంతే కాకుండా శిక్ష విధించే నిబంధన ఉంది. ఎటువంటి పరిస్థితిలోనూ టిక్కెట్ లేకుండా రైలులో ప్రయాణించకూడదు.

రైల్వే చట్టం సెక్షన్ 138 ప్రకారం జరిమానా

రైలు టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు తేలితే రైల్వే చట్టంలోని సెక్షన్ 138 ప్రకారం ప్రయాణికుడికి జరిమానా విధిస్తారు. ప్రయాణించిన దూరానికి, రైలు బయలుదేరిన స్టేషన్‌కు సాధారణ సింగిల్ ఛార్జీ, అదనపు రుసుం అంటే రూ.250 దానికి సమానం. ఏది ఎక్కువ అయితే అది జరిమానాగా విధిస్తారు. అంతేకాకుండా ప్రయాణికుడిని జైలులో పెట్టాలనే నిబంధన కూడా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎప్పుడూ రైలు టిక్కెట్ తీసుకుని మాత్రమే ప్రయాణించాలి. రైలు టిక్కెట్లను రైల్వేస్టేషన్‌లోని టిక్కెట్ కౌంటర్ నుంచి తీసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ బుక్ చేసుకోవచ్చు. 'ఐ.ఆర్.సి.టి.సి' వెబ్‌సైట్, యాప్‌లతో రైల్వే టిక్కెట్ల బుకింగ్ సులభంగా చేయవచ్చు. అలాగే యూటీఎస్ యాప్ నుంచి టిక్కెట్లను తీసుకోవచ్చు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-రేణిగుంట: అవినీతి అక్రమాలకు పాల్పడుతూ.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రేణిగుంట గ్రామపంచాయతీ కార్యదర్శి తీరుకు వ్యతిరేకంగా గ్రామ పంచాయతీ బోర్డు సమావేశానికి వార్డు సభ్యులు హాజరు కాలేదు. బుధవారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో బోర్డు మీటింగ్‌కు 15 మంది వార్డు సభ్యులు డుమ్మా కొట్టారు. పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు పాల్పడుతున్నాడని.. పంచాయతీకి చెడ్డ పేరు తీసుకువచ్చేలా విధులు నిర్వహిస్తున్నారని వార్డు మెంబర్లు వాపోతున్నారు.

గ్రామ ఆస్తులు కాపాడాలని వినతి

ప్రజాశక్తి-పెళ్లకూరు: తాల్వాయిపాడు గ్రామంలో అక్రమంగా లేఅవుట్లు వేసి కోట్లతో వ్యాపారాలు జరుగుతున్నాయని.. ప్రభుత్వ భూమిలో రోడ్డును నిర్మించి అమ్మకాలు జరుగుతున్నా అధికారులు, పాలకులు పటించుకోవడం లేదని గ్రామస్థులు బుధవారం డీఎల్‌పీవోకు ఫిర్యాదు చేశారు. ఈవోపీఆర్డీ వారికి సహకరిస్తున్నారని వాపోయారు. గ్రామానికి చెందిన ఆస్తులు కాపాడాలని కోరారు.

బి.ఆర్క్ ఫలితాలలో నారాయణ ప్రభంజనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎన్‌టీఏ మంగళవారం ప్రకటించిన జెఈఈ– మెయిన్ (బి.ఏఆర్ సిహెచ్) ఫలితాలలో తమ విద్యార్థులు జాతీయస్థాయి ఓపెన్ కేటగిరీ లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారని నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు తెలిపారు. స్థానిక ఎమ్మార్పల్లిలోని ఆ కళాశాలలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ విద్యార్థి భువనచంద్ర 28వ ర్యాంకు, బాబు సుజన్ రెడ్డి 31వ ర్యాంకుతో ఆల్ ఇండియాలో మొదటి 100 లో రెండు ర్యాంకులు సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డీన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపకులు విజయ్ కుమార్, సందీప్, చిట్టిబాబు, దుర్గాప్రసాద్ అభినందించారు. వారికి సహకరించిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా మోహన్ కుమార్‌రాజు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా కె మోహన్ కుమార్ రాజు ఎన్నికయ్యారు. తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్య వర్గం, అనుబంధ సంఘాల ప్రతినిధుల సమావేశం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీసులో జరిగింది. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా కొండూరు మోహన్ కుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా వాసుదేవన్, కోశాధికారిగా చేగు అయ్యప్పని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రావు తెలిపారు.

షేక్ ఫరీద్‌బాబాకు ఎన్టీఆర్ కీర్తి పురస్కార అవార్డు

ప్రజాశక్తి-రేణిగుంట: శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక చిక్కడపల్లి హైదరాబాద్‌లో బుధవారం ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ కీర్తి పురస్కార అవార్డులో భాగంగా రేణిగుంటకు చెందిన ఎంఏ జబ్బార్ ట్రస్ట్ అధినేత డాక్టర్ షేక్ ఫరీద్ బాబా, షేక్ హసీనా భాను, తనయుడు క్రికెట్ దిగ్గజం టోర్నమెంటులలో ఎక్కువ విజయాలను సాధించి అత్యధిక పరుగులను కొట్టడంలో దిట్ట యువకుడు షేక్ జాకీర్ ను వేదికపై సన్మానించి అవార్డును అందజేశారు. ఎన్టీఆర్ పురస్కార అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందని ఫరీద్‌బాబా తెలిపారు.

వాలంటీర్లు.. ప్రజాసేవలో సారథులు..!

ప్రజాశక్తి-గూడూరు టౌన్: వాలంటీర్లు.. ప్రజాసేవలో సారథులని.. అతి తక్కువ వేతనంతో ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని.. వారి సేవలను గుర్తించి వాలంటీర్లకు వందనం కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో రూరల్ పరిధిలోని వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ వాలంటీర్లను సన్మానించి అభినందించారు. గత నాలుగు సంవత్సరాలుగా వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని..ఎక్కడికి వెళ్లినా ప్రజలు వాలంటీర్లను అభినందిస్తున్నారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తే ప్రతిపక్ష టీడీపీ పార్టీ వాలంటీర్ల కారణంగా కరోనా ఎక్కువైపోయిందని మాట్లాడటం దారుణమన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డీపీవో వాణిరెడ్డి, తహశీల్దారు లీలారాణి, రూరల్ సీఐ దశరథ రామారావు, జడ్పీటీసీ యామిని, నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగలోని మార్కెట్ యార్డ్‌లో బుధవారం వాలంటీర్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఘనంగా సన్మానించి పారితోషకం అందించారు. కార్యక్రమంలో విద్యానాథరెడ్డి, తహశీల్దారు హనుమాన్‌నాయక్, ఎంపీడీవో త్రివిక్రమ రావు, ఎంపీపీ సుబ్బులక్ష్మి, ప్రతిమారెడ్డి, మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

బుచ్చినాయుడుకండ్రికలో వైసీపీ నాయకుడు మునిరాజా అనారోగ్యంతో చికిత్సలు చేసుకొని ఇంటికి రావడంతో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆయన స్వగహానికి చేరుకొని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

జాతీయ రహదారి ప్రజల కోసమా.. కార్పొరేట్ల కోసమా..!

ప్రజాశక్తి -సత్యవేడు: జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారులు ప్రజల అవసరం కోసమా.. అదానీ కోసమా.. అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ ప్రశ్నించారు. బుధవారం సత్యవేడులోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు–తచ్చూరు ఆరు వరుసల జాతీయ రహదారిని నిర్మిస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఉపయోగకరంగా లేకుండా చేపడుతోందన్నారు. రహదారిలో తిరుపతి జిల్లాలోని ఏ మండలం వాసులైన ఆ జాతీయ రహదారిలోకి ప్రవేశించకుండా రోడ్డు నిర్మాణం చేస్తుండటం దారుణమన్నారు. వేల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న జాతీయ రహదారి ప్రజల కోసమా.. కార్పొరేట్ కంపెనీల కోసమా.. అన్ని ప్రశ్నించారు. తిరుపతి జిల్లాలో వస్తున్న ఈ రోడ్డులో ఎక్కడ కూడా సర్వీసు రోడ్డు లేకుండా కేవలం జాతీయ రహదారి మాత్రమే ఉండటంతో ప్రజలు, వాహనదారులు, అటు చెన్నైకి వెళ్లాలన్నా.. ఇటు బెంగళూరు వెళ్లాలన్న తక్కువ సమయాన్ని చేరుకునేలా మధ్యలో సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అరుణాచలం, సత్యవేడు మండల కార్యదర్శి రమేష్, నాయకులు మునస్వామి, సెల్వం, నాగలాపురం మండల కార్యదర్శి మురుగేష్, పిచ్చాటూరు మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, నారాయణవనం మండల కార్యదర్శి మునిశంకర్, కేవీబీపురం మండల కార్యదర్శి నాగరాజు, ధనంజయులు, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కిట్ సిబ్బందికి భృతి దక్కేనా..!

● కోర్టు చెప్పినా పట్టించుకోని ముక్కంటి అధికారులు
● ఆందోళనలో బోధనేతర సిబ్బంది

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థాన అనుబంధ స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల బోధనేతర సిబ్బందికి తాత్కాలిక భతి చెల్లింపులో ఆలయాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. స్కిట్ బోధనేతర సిబ్బందికి నెలకు రూ.10 వేలు తాత్కాలిక భతి చెల్లించాలని ఈ నెల 20వ తేదీన రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. అయితే కోర్టు ఆదేశాలను ఆలయాధికారులు దిక్కరిస్తూ అమలు చేయడం లేదని బోధనేతర సిబ్బంది ఆరోపిస్తున్నారు. అలాంటి ఆదేశాలేవీ తమకు రాలేదంటూ బుకాయిస్తున్నారని వాపోతున్నారు. ముక్కంటి అనుబంధంగా నడుస్తున్న స్కిట్ లో 16 నెలల క్రితం అడ్మిషన్లు తగ్గిపోవడంతో జీతాలు చెల్లించడం ఆలయానికి భారంగా మారిందంటూ కళాశాలను మూసివేశారు. కళాశాలలో పనిచేస్తున్న 36 మంది బోధనేతర సిబ్బంది, 29 మంది బోధనా సిబ్బంది తమకు దేవాదాయశాఖ ప్రత్యామ్నాయంగా ఉద్యోగాలు చూపాలంటూ, లేకుంటే భతి చెల్లించాలని డిమండ్ చేశారు. అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో ఉద్యోగులు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో ఈ కేసులో తుదితీర్పు వచ్చే వరకు బోధనేతర సిబ్బందికి నెలకు రూ.10వేలు చొప్పున తాత్కాలిక భతి ఇవ్వాల్సిందిగా దేవాదాయశాఖను హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో మధ్యంతర భతిపై బోధనేతర సిబ్బంది ఓ హర్షం వ్యక్తం చేస్తున్నా మరో వైపు ఆలాయాధికారులు అమలు చేస్తారా? లేదా? అన్న ఆలోచనలో ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-నాయుడుపేట: మహిళ హత్యకేసులో నిందితులను నాయుడుపేట పోలీసులు ఎట్టలకేలకు అరెస్టు చేశారు. బీహార్లో పది రోజులపాటు మకాం వేసి నిందితులను తీసుకురావడంతో అందరి అభినందనలు అందుకున్నారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నాయుడుపేటలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన ఉదయం శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవనంలో గుర్తు తెలియని మహిళ మతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు. అర్బన్ సీఐ నరసింహారావు వివరాలను సేకరించే పనిలోపడ్డారు. అంతకుముందు ఈ భవనంలో స్థానిక వడ్లు వ్యాపారులు బీహార్‌కు చెందిన కొంతమంది కూలీలను అద్దెకు ఉంచినట్లు విచారణలో తేలింది. ఆ దిశగా విచారణ సాగించిన సీఐ నరసింహారావు హత్య అనంతరం నిందితులు బీహార్‌కు పరారైనట్లు తేలింది. పట్టు వదకుండా సీఐ నరసింహారావు, పెళ్లకూరు ఎస్సై కష్ణారెడ్డి, నాయుడుపేట ఎస్సై శ్రీకాంత్, శ్రీహరికోట ఎస్సై మనోజ్ కుమార్, సూళ్లూరుపేట ఎస్సై రవిబాబులతో మూడు బందాలు ఏర్పాటుచేసి బీహార్‌కు పంపారు. అక్కడి పోలీసుల సహకారంతో నిందితుల ఫోన్‌నంబర్ల ఆధారంగా గాలించి వారిని అరెస్టు చేసి తీసుకొచ్చారు. చాకచక్యంగా నిందితులను అరెస్టు చేయడంతో డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి సీఐ, ఎస్సైలను అభినందించారు.

ప్రైవేటు బస్సును వెనుకనుంచి ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తిరువళ్లూరు నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు బస్సు పుత్తూరు మండలంలోని తడుకు వద్ద ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొంది. ప్రమాదంలో సుమారు 30 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సులో ఇరుక్కున్న డ్రైవర్ హరిబాబును క్రేన్ సాయంతో బయటకు తీశారు. ఆర్టీసి కండక్టర్ జాఫర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అడవుల్లోకి చొరబడిన ఏడుగురి అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల్లో జంతువులను వేటాడటానికి రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ప్రవేశించిన ఏడుగురిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్సు డీఎస్పీ చెంచురాజు ఆదేశాలతో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన లింగాధర్ బందం, అటవీ శాఖ సిబ్బందితో కలసి మంగళవారం సానిపాయ టాస్క్ ఫోర్సు క్యాంపు నుంచి ఎర్రచందనం స్మగ్లర్ల కోసం బయలుదేరారు. టాస్క్ ఫోర్స్ బందాలు పింఛా సెక్షన్, జిల్లేలమంద బీటులోని దయ్యాల పెంట ప్రదేశంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా రాతిదొన ప్రదేశంలో కొంత మంది వ్యక్తులు ఉండటాన్ని గమనించారు. వారిని చుట్టుముట్టగాజజ ఏడుగురు ఉన్నట్లు గుర్తించి వారివద్దనున్న ఒక నాటు తుపాకీ, నల్లమందు, రవ్వలగుండ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని అన్నమయ్య జిల్లా రాయవరం గ్రామానికి చెందిన పాముల సాయి (30), మదుంపాడు గ్రామానికి చెందిన బెల్లంకొండ సురేంద్ర (52), పాగ మురళి (40), బోడక దేవేంద్ర (25), పసుపులేటి భాస్కర్ (53), కడప టౌన్ కు చెందిన చిప్పల సాయికుమార్ (23), షేక్ హుస్సేన్ (37)లుగా గుర్తించి అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. నాటు తుపాకీలో ఒక రౌండు కాల్పులు జరిగినట్లు నిర్ధారించామన్నారు. ఒక దుప్పిని వేటాడినట్లు, అయితే అది తప్పించుకుని పోయినట్లు నిందితులు అధికారులకు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.

కాంచనమ్మ మరణం టీడీపీకి తీరనిలోటు

ప్రజాశక్తి-తొట్టంబేడు: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు నరసింహారెడ్డి, కాంచనమ్మ మరణం పార్టీకి తీరని లోటని దివంగత మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి సతీమణి బొజ్జల బందమ్మ అన్నారు. తొట్టంబేడు మండలం పొయ్యి పంచాయతీకి చెందిన ఉన్నం చెంచుమునినాయుడు భార్య కాంచనమ్మ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందడంతో ఆమె భౌతిక కాయానికి బొజ్జల బందమ్మ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె భర్త చెంచుమునినాయుడు, కుమారుడు భానును మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. అలాగే సింగమాల పంచాయతీకి చెందిన నరసింహారెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది వచ్చిన తరువాత స్వగ్రామంలో మరణించడంతో ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అతని భార్య గాయత్రి, కుమార్తెలు గంగోత్రి, పావనిలకు మనోధైర్యం కల్పించారు. నరసింహారెడ్డి కుమార్తె గంగోత్రిని ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూలులో చదివించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గురుకుల పాళెం హరిజనవాడకు చెందిన శ్రీరాములు, సక్కమ్మ కుమారుడైన రూపేష్ వేసవి సెలవుల్లో తెలుగు గంగ కాలువలో ఈతకు వెళ్లి నీటిలో కొట్టుకొని పోవడంతో వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు, పాల సొసైటీ మాజీ చైర్మన్ రావిళ్ళ మునిరాజా నాయుడు, మల్లీశ్వరి, తెలుగు యువత అధ్యక్షులు నెలబల్లి సునీల్ కుమార్, మాజీ ఎంపీటీసీ విజయ్ కుమార్ నాయుడు, ఘట్టమనేని శంకర్ నాయుడు, లెక్కల మురళి నాయుడు, బీసీ సెల్ నాయకులు గుర్రప్ప, కమల్ నాథ్, వీరరాఘవులు, శివకుమార్, మురళి, సతీష్ నాయుడు, కేశవులు నాయుడు, హరీష్ చౌదరి, రమణయ్య నాయుడు, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్వం విద్యాసంస్థల ప్రభంజనం

ప్రజాశక్తి-క్యాంపస్: జాతీయ స్థాయిలో 2023 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో తిరుపతి విశ్వం విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా విశ్వం విద్య సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. యన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో 6, 9 తరగతిలో ప్రవేశం కోసం జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో తిరుపతి విశ్వం విద్యార్థులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకుతో పాటు ఆల్ ఇండియా 10వ ర్యాంకు సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయిలో 10 లోపు 6 ర్యాంకులు సాధించి సంచలన ఫలితాలు నమోదు చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో ఎం.నవదీప్ ప్రథమ ర్యాంకును, ఏ.కరణ్, టీ.దినేష్, కే.పూజిత్, పీ.అజయ్ కుమార్, ఎన్.తనీష్ లు రాష్ట్ర స్థాయిలో 10 లోపు 6 ర్యాంకులు సాధించారు. వీరితో పాటు కే.హర్షిత్, ఎస్.వర్షిణి, ఏ.విష్ణు స్వరూప్ పీ.యశ్వంత్, ఎ.నిషాంత్,పీ.హేమ సాయి, భగత్, గురు చరణ్, హర్షిత్, జై గణేష్, సాగర్, నితీష్ రెడ్డి, సూర్య, హేమంత్‌కుమార్, తనుష్, కే.శశాంక్, జ్యోతి, పి.లక్ష్మి నరసింహ సాయి తదితరులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడంతో పాటు ఆరో తరగతి గణితంలో 150/150 మార్కులు, 9వ తరగతి గణితంలో 200/200 మార్కులు, ఇంటెలిజెన్స్ టెస్ట్ లో 50/50 మార్కులు విశ్వం విద్యా సంస్థల విద్యార్థులు సాధించడం మన రాష్ట్ర విద్యాశాఖకే గర్వకారణమని విశ్వం విద్యాసంస్థల అధినేత డా. ఎన్.విశ్వనాథరెడ్డి తెలియజేశారు. విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ యన్.విశ్వచందన్ రెడ్డి విద్యార్థుల్ని అభినందించారు.